యూరియా..యాతన..!

- యూరియా అందక రైతుల అవస్థలు
- నేటికీ రాని 20-20.013 కాంప్లెక్స్ ఎరువులు
- బ్లాక్‌లో అధిక రేట్లకు కొనలేకపోతున్న రైతులు
- కాంప్లెక్ ఎరువులు అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన

హనుమంతునిపాడు:

వర్షాలు పడి పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువులు అందడం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే కాంప్లెక్స్ ఎరువులు, యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో బోర్లు, ఇరిగేషన్ చెరువులు, వ్యవసాయ బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు. అయితే కాంప్లెక్స్ ఎరువులు నేటికీ ఒక్క బస్తా కూడా రైతు సేవా కేంద్రాల నుంచి అందలేదు. ప్రస్తుతం బోరుబావుల కింద వరి, మెట్ట పంటలుగా మినుము, అలసంద, వేరుశనగ సాగుచేస్తున్నారు. అయితే బలానికి వాడే కాంప్లెక్స్ ఎరువులు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో రూ.1250 పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. యూరియా కూడా రైతులకు అందడం లేదు. మండలానికి యూరియా 85 టన్నులు అవసరమని అంచనాలు పంపించగా 14 రైతు సేవా కేంద్రాల పరిధిలో 24 టన్నులు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. 20.20.013 కాంప్లెక్స్ ఎరువు నేటికి ఒక్కక్క బస్తాకూడా రాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


అరకొరగా వచ్చిన యూరియా


బోర్ల కింద వరి సాగుకు దమ్ము చేస్తున్న రైతులు

అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం



బోర్ల కింద వరి, వేరుశనగ సాగు చేశాం. కాంప్లెక్స్ ఎరువులు రాలేదని అధికారులు చెబుతున్నారు. యూరియా కూడా అందలేదు. కాంప్లెక్స్ ఎరువు బ్లాక్‌లో రూ.1250 పెట్టి కొనుగోలు చేస్తున్నాం.

– ఎస్ సాంబిరెడ్డి, రైతు

యూరియా కూడా సరిపడా రాలేదు



ఒక బస్తాకు మించి యూరియా ఇవ్వడం లేదు. కొరతగా వచ్చిందని మళ్లీ వస్తే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. మినుము, అలసంద పంటల సాగుకు బలానికి పొలం సాగు చేసి విత్తనం విత్తేముందు కాంప్లెక్స్ ఎరువు పొలానికి పెట్టాలి. రైతు సేవా కేంద్రాలకు ఒక్క బస్తా కూడా కాంప్లెక్స్ ఎరువు రాలేదు. అధికారులను అడిగితే వస్తే ఇస్తామని చెప్తున్నారు .బ్లాక్‌లో కొనుగోలు చేయక తప్పడం లేదు.

– గుంటక పెద్దన్న, రైతు

క్లుప్తంగా

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలి


ఎరువులు, పురుగుమందుల దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

హనుమంతునిపాడు: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు రైతులకు అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎస్సై ఎం మాధవరావు, ఏఓ వి.రవికుమార్ అన్నారు. వేములపాడులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంత స్టాక్ ఉందో అడిగి తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ కృష్ణచైతన్య, వ్యవసాయ శాఖ సిబ్బంది గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

శ్రీనివాసులు మృతి పార్టీకి తీరని లోటు


శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు

కొండపి: మార్పూరి శ్రీనివాసులు మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మార్పూరు శ్రీనివాసులు మరణించగా విషయం తెలుసుకున్న ఆయన గృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇచ్చారు. గ్రామ నాయకుడు పర్చూరు సుబ్బయ్య, కొల్లూరి సుబ్బారావు, నజీర్, గంగాధర్, చంద్రశేఖర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలందించాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

టంగుటూరు: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కాకుటూరివారిపాలెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రంలో ఉన్న పరిస్థితులను, రికార్డులు, రోగులకు అందించాల్సిన మందుల నిల్వలు పరిశీలించి సూచనలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలను అందుతున్న వైద్య సేలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగేశ్వరరావు, సీహెచ్ఓ మాతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావు

పీసీపల్లి: పీ4 సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ కృష్ణారావు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సిబ్బంది ప్రతి కుటుంబం గురించి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈఓ ప్రభాకర్‌శర్మ, వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనిదినాలు పెంచడం దుర్మార్గం


బొమ్మల సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నేతలు

టంగుటూరు: పని గంటల పెంపు శ్రామిక శ్రమనే కాకుండా కుటుంబ వ్యవస్థను కూడా దెబ్బతీస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గెంటనపల్లి శ్రీనివాసులు అన్నారు. పని గంటలు పెంచుతూ జారీ చేసిన జీఓను వెనక్కి తీసుకోవాలని స్థానిక బొమ్మల సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన పని గంటల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, వి.మోజెస్, జి. కాశీవిశ్వనాథ్, డి. తిరుమలరావు, పి. రాజశేఖర్, పి. అరుణ్కుమార్, జి.సాల్మన్, ఎం యానాది, కె. రామారావు, మహేష్ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రధానంగా ప్రభుత్వ పథకాల అమలుపై పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. సమావేశంలో వ్యవసాయాధికారి కాశివిశ్వనాథ్ మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉందని, బర్లీ పొగాకు సాగుచేస్తే కఠిన చర్యలు ఉంటాయని సాగు నిషేధమని చెప్పారు. కానీ బర్లీపొగాకు నారు పెంచితే చర్యలు తీసుకుంటామని చెప్పలేదు. సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ పైడిపాడు, కామేపల్లి, సతుకుపాడు గ్రామాల రైతు సేవా కేంద్రాలకు యూరియా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కోల్డ్ స్టోరేజీల్లో శనగ నిల్వలు ఉన్నాయని, గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోల్డ్ స్టోరేజీలో శనగ నిల్వలు ఉన్న ప్రతి రైతుకు రూ.30 వేల ఇచ్చారని, ప్రస్తుతం ఉన్న ధరలను బట్టి రైతు సంఘాల నాయకులు శనగలు క్వింటాకు 3 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఏఓ కాశీ విశ్వనాథ్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని ఒకవేళ ఆదేశాలు వచ్చినా ఈ క్రాప్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం డబ్బులు ఇస్తుందని వివరించారు. ప్రభుత్వ వైద్యాధికారి కావ్య మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీకి ఏబేట్ ఇస్తామని, వారానికి ఒకసారి చొప్పున 8 వారాలు పిచికారీ చేయాలని సూచించారు. సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ తాను చాలా ఏళ్లగా సర్పంచ్‌గా ఉన్నానని, కానీ ఒకటి లేక రెండు సార్లు మాత్రమే ఏబేట్ పిచికారీ చేస్తున్నామని తెలిపారు. వైద్య శాఖ ద్వారా ఏబేట్ అందిస్తే 8 సార్లు పిచికారీ చేస్తామని తెలిపారు.

పశువైద్యాధికారి శ్రావణి మాట్లాడుతూ పశువుల దాణా మండలానికి 10,900 కేజీలు వచ్చిందని అన్ని గ్రామాలకు అందజేసామని తెలిపారు. దీనిపై సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ పైడిపాడు గ్రామానికి పశువుల దాణా ఎందుకు ఇవ్వలేదని పశువైద్యాధికారి శ్రావణిని ప్రశ్నించారు. సమావేశంలో వ్యవసాయ, వైద్య, పశువైద్య, అంగన్వాడీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఈజీఎస్, రెవెన్యూ, ఐకేపీ శాఖల అధికారులతో మాత్రమే ఎంపీడీఓ రమణమూర్తి సమీక్ష నిర్వహించారే తప్ప మరిన్ని ప్రధాన శాఖలైన విద్య, ఇరిగేషన్, ఎక్సైజ్, మైనింగ్, పంచాయతీరాజ్, హార్టికల్చర్, విద్యుత్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించకపోవటంపై సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ బెల్లం నిర్మల, తహశీల్దార్ మురళి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఏఓ కాశీ విశ్వనాథ్‌ను ప్రశ్నిస్తున్న పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్

పొగాకు కనిష్ట ధర రూ.90

కొండపి: స్థానిక వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.90 పలికిందని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 960 బేళ్లను వేలానికి తీసుకురాగా 719 బేళ్లను కొనుగోలు చేసి 241 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.242.51గా నమోదైంది. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 250 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం గ్రామాల చెందిన రైతులు 877 బేళ్లను తీసుకురాగా 627 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.100, సరాసరి ధర రూ.241.32గా నమోదైంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

కనిగిరి రూరల్: కనిగిరి నుంచి పామూరు వైపు వెళ్తున్న ఆటోను అదే మార్గాన వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు.. సోలార్ సామగ్రి బిగించేందుకు కనిగిరి నుంచి పామూరుకు ఆటో వెళ్తోంది. దానిలో డ్రైవర్ కాసుల వెంకటేశ్వర్లుతో పాటు గడివేముల వెంకటేశ్వర్లు, పి.సాయి శివయ్య, ఎం.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ క్రమంలో మండలంలోని కార్తీకపురం-మండాదివారి పల్లి మధ్య వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం లారీ..ఆటోను వెనుక భాగంలో సైడ్‌కు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి.


సంఘటన స్థలం

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే గఫార్, కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక డిపో ఆవరణలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డీఎం మొహమ్మద్ సయానా బేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. అందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మున్సిపల్, సచివాలయ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గఫార్, పక్కన కమిషనర్, ఆర్టీసీ డీఎం

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

కొండపి: క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని సెక్టార్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. మండలంలోని కట్టుబడిపాలెం, చోడవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయకూరలు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బయట జంక్‌ఫుడ్స్‌ను తగ్గిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. పిల్లల్లో వయసు తగిన ఎత్తు, ఎరువు ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు, నూనె తగ్గించి ఆకు కూరలు కూరగాయలు సమయానుసారంగా దొరికే పండ్లను తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఆయాలు పాల్గొన్నారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విక్టోరియా రాణి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సందీప్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య హెల్త్ క్లినిక్ పరిధిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. విష జ్వరాలు సోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దివాకరపల్లి ఆర్‌ఓ ప్లాంట్ పునరుద్ధరించాలి

పీసీపల్లి: మండల పరిధిలోని దివాకరపల్లెలో ఆర్‌ఓ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. గ్రామాన్ని మంగళవారం సందర్శించగా గ్రామస్తులు ప్లాంట్ కొన్నేళ్లుగా పనిచేయడం లేదని చెప్పగా ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామానికి వస్తున్నటువంటి సాగర జలాలు రోడ్డు నిర్మాణ క్రమంలో పైపులు పగిలిపోవడంతో రావడం లేదన్నారు. చెర్లోపల్లి మండలంలో అనేక గ్రామాలకు సాగర్ జలాలు అందక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఫ్లోరిన్ ఉన్నటువంటి ప్రాంతం పెద్ద చెర్లోపల్లి మండలం అని తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివాకర్ పల్లె గ్రామంలో ఇప్పటికే 40 మంది చనిపోగా మరో ముగ్గురు డయాలసిస్ పేషెంట్లు ఉన్నారని ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే తక్షణమే ఆర్‌ఓ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొమ్ములపాటి మాల్యాద్రి వేట వీరనారాయణ, నూకతోటి మల్లికార్జున, కోటపాటి మాలకొండయ్య, వజ్రాల చెన్నయ్య పాల్గొన్నారు


మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న నేతలు

గ్రావెల్ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సింగరాయకొండ: గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎస్‌వీబీ రాజేష్ గ్రావెల్ రవాణాదారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలతో గ్రావెల్ రవాణాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తహశీల్దార్ రాజేష్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడ కూడా గ్రావెల్ రవాణా నిషేధమన్నారు. గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతుందని పత్రికలలో వచ్చిన కథనాలపై మైనింగ్‌శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు వచ్చి ఏమేర అక్రమ మైనింగ్ జరిగిందో వివరాలు సేకరించారన్నారు. గత తహశీల్దార్‌లు కౌన్సెలింగ్ ఇచ్చారని, అయినా అక్రమ గ్రావెల్ రవాణా జరిగిందని అప్పుడు మైనింగ్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు వచ్చి 70 వేల క్యూబిక్‌మీటర్ల గ్రావెల్ రవాణా అయిందని నిర్ధారించారన్నారు. ఇకపై అక్రమ గ్రావెల్ రవాణాను ఉపేక్షించేది లేదని గ్రావెల్ రవాణాదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక కమిటీ వేశామని అందులో తహసీల్దార్, ఎస్సై, వీఆర్ఓ, సర్వేయర్, మహిళా పోలీసు సభ్యులుగా ఉంటారని వివరించారు. ఎస్సై బి.మహేంద్ర, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, గ్రావెల్ రవాణాదారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ నడకదారిపై తొలగిన అడ్డంకులు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాల మధ్య నడక దారిలో సుమారు గత 5 నెలలుగా రైలు బోగీలు నిలపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, దివ్యాంగుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. దీనికి తోడు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా లిఫ్ట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అది ఎప్పుడు ఏర్పాటు చేస్తారో ప్రయాణికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 20 వ తేదీ 'ప్రమాదం...తప్పదు ప్రయాణం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు నడకదారిపై రైలు బోగీలు తొలగించటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రైల్వేస్టేషన్ లో నడకదారిలో రైలు బోగీలు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

జ్యోతి స్వరూపిణీ నమోస్తుతే..!


భైరవకోనలో రాజరాజేశ్వరీదేవిగా త్రిముఖదుర్గాదేవి అమ్మవారు


పామూరులో విశిష్ట అలంకారములో వాసవీమాత మూలవిగ్రహమూర్తి


నందనమారెళ్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం రెండో రోజు త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీఎస్‌పురంలో పెద్దమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. భైరవకోనంలో అర్చకులు కేవీ నరసయ్య, కె.సుధాకర్, పంచాగ్నుల రామమూర్తి, జీకే సుధాకర్‌శర్మ, సామూహిక కుంకుమార్చన, హోమం నిర్వహించారు.

పామూరు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా వాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారు మీనాక్షీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. మహాలక్ష్మి అమ్మవారు, వల్లీ భుజంగేశ్వర ఆలయంలో వల్లీ అమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద నిర్వహించిర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

పీసీపల్లి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదయిర్లపాడు మల్లేశ్వర స్వామి దేవాలయంలో భ్రమరాంబికాదేవి అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పలుకురు సుబ్బారావు అమ్మవారికి కుంకుమార్చన, లలితా సహస్ర నామార్చాన చేశారు. ఉభయదాతలు బొర్రా కొండారెడ్డి, కొండమ్మ మల్లేశ్వరస్వామి దేవస్థానం అమ్మవారికి పట్టు చీర సమర్పించారు.

టంగుటూరు: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి రెండో రోజు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్‌లు అమ్మవారికి పూజలు,అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకాలంకరణ చేశారు. ఈఓ బి. రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి రోజు ఆలయంలో చక్రార్చన, శతచండీ పారాయణం, సూక్తి పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు.

కనిగిరిరూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందనమారెళ్ల బాలకోటేశ్వర స్వామి ఆలయంలో చండి, రుద్ర హోమాలు జరిగాయి. గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి కళ్యాణోత్సవాలు, విశిష్ట పూజలు చేశారు. శివనగర్ కాలనీలోని దత్త పీఠంలో లలితా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పెదయిర్లపాడులో భ్రమరాంబికాదేవిగా అమ్మవారు


నాగిరెడ్డిపాలెంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు


వల్లూరులో గాయత్రిదేవిగా వల్లూరమ్మ తల్లి